కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ

- హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి

హుజూర్‌నగర్: నాగయ్య కుటుంబ సభ్యులకు బీమా చెక్కును అందజేస్తున్న ఒంటెద్దు నర్సింహారెడ్డి

హుజూర్‌నగర్, జనవరి 17: కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి అన్నారు. పట్టణ పరిధిలోని మగ్ధూం నగర్‌కు చెందిన జడ నాగయ్య ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో మృతిచెందగా, ఆయనకు బీఆర్ఎస్ సభ్యత్వం ఉండడంతో పార్టీ తరఫున రూ.2 లక్షల బీమా చెక్కును శుక్రవారం నాగయ్య భార్య రమాదేవికి నరసింహారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వర్‌రావు, నాయకులు డాక్టర్ కేఎల్ ఎన్.రెడ్డి, బెల్లంకొండ అమర్, నగేశ్, చంద్రమౌళి, సుందరయ్య, నాగిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, శంభిరెడ్డి, బ్రహ్మారెడ్డి, పరశురాం, నరసింహారావు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: మండలంలోని అనంతారం బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కట్ల నాగార్జున తండ్రి కొండయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, శుక్రవారం ఒంటెద్దు నర్సింహారెడ్డి వారి నివాసానికి వెళ్లి కొండయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బిట్టు నాగేశ్వర్‌రావు, ఒంటెద్దు రాఘవరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు మామిడి అంజయ్య, దంతాల వెంకటేశ్వర్లు, దండెపల్లి సత్యనారాయణ, షేక్ మస్తాన్, పొంతటి మల్లారెడ్డి, చిటేపు నారాయణరెడ్డి, తుమ్మకొమ్మ విజయ్, జనార్దన్, శ్రీకాంత్, గోవర్ధన్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఘనంగా సుధా బ్యాంక్ రజతోత్సవం

వేడుకల్లో పాల్గొన్న బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్ తదితరులు

సూర్యాపేట టౌన్, జనవరి 17: జిల్లా కేంద్రంలోని సుధా బ్యాంక్ రజతోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్, ఎండీ పెద్దిరెడ్డి గణేశ్ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మినీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ కేక్ కట్ చేశారు. సూర్యాపేట సర్వీస్ బ్రాంచిలో నూతనంగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ లాకర్లను చైర్మన్, ఎండీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు రజతోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. వేడుకల్లో భాగంగా నేడు పట్టణంలోని త్రివేణి గార్డెన్స్‌లో 22వ త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ వైస్ చైర్‌పర్సన్ పొనుగోటి నిర్మల, డైరెక్టర్లు భువనగిరి భాస్కర్, కక్కిరేణి చంద్రశేఖర్, శంకర్‌లాల్, ఏపూరి శ్రావణ్‌కుమార్, సుజాత, డాక్టర్ సందీప్‌తో పాటు పెద్దిరెడ్డి రాజా, తోట శ్యామ్, గుడిపుడి వెంకటేశ్వర్‌రావు, అప్పం శ్రీనివాసరావు, గాలి శ్రీనివాస్, భాగ్యశ్రీ వెంకన్న, తోట సత్యనారాయణ, లక్ష్మారెడ్డి, రవీందర్‌రెడ్డి, రాచకొండ శ్రీనివాస్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి : ఎస్ఐ

హుజూర్‌నగర్‌లో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ముత్తయ్య

హుజూర్‌నగర్, జనవరి 17: వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ ముత్తయ్య సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఇందిరా సెంటర్‌లో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలు నడిపేవారు తప్పక ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, హెల్మెట్ ధరిస్తే ప్రాణాలకు రక్షణగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తుంగతుర్తి: మండల కేంద్రంలో ఎస్ఐ రుద్ర క్రాంతికుమార్ ఆధ్వర్యంలో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఏఎస్ఐ భగవాన్, సిబ్బంది పాల్గొన్నారు.

చిలుకూరు: మండల కేంద్రంలోని లారీ అండ్ డీసీఎం ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో కోదాడ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జిలాని పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను పాటించాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌కే.నన్నేసాహెబ్, గన్నా ప్రసాద్, రామకృష్ణ, భద్రయ్య, బాలాగౌడ్, గన్నా రామారావు, పాషా తదితరులు పాల్గొన్నారు.

40 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని అమలు చేయాలి

- టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సైదులు

కోదాడ టౌన్, జనవరి 17: రాష్ట్రంలో 40 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని అమలు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బడుగుల సైదులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం కోదాడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ..రాష్ట్రంలో రెండో పీఆర్సీని అమలు చేయడానికి రిటైర్డ్ ఐఏఎస్ శివశంకర్ చైర్మన్‌గా ఏర్పాటు చేయబడిన పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేసి ఏడాది దాటిపోయిందని, జాప్యం చేయకుండా వెంటనే వేతన సవరణ కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2025 ఏప్రిల్ నెల నుంచి పీఆర్సీ అమలు చేస్తానని హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. వెంటనే నివేదికను అందజేస్తే దాని మీద ప్రభుత్వం అధ్యయనం చేసి అమలు చేయడానికి వీలవుతుందని అన్నారు.

వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం కమిటీ ఎన్నిక

హుజూర్‌నగర్, జనవరి 17: తెలంగాణ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం జిల్లా నూతన కమిటీని శుక్రవారం హుజూర్‌నగర్‌లోని జడ్పీహెచ్ఎస్‌లో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మన్నెం సీతారామరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రామ్మోహనచారి, కోశాధికారిగా రవి, ఉపాధ్యక్షులుగా సునీత, హుస్సేన్, వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా సరళ, కార్తీక్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా క్రాంతికుమార్, నరేశ్, సైదిరెడ్డిని ఎన్నుకున్నారు.

ఎస్ఐగా పదోన్నతి పొందిన సైదులుకు సన్మానం

నేరేడుచర్ల, జనవరి 17: మండల కేంద్రం నేరేడుచర్ల పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తూ ఎస్ఐగా పదోన్నతి పొందిన ఎ. సైదులును శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది లక్ష్మయ్య, శ్రీలత, సురేశ్, వీరాంజనేయులు, వెంకన్నగౌడ్, హనుమాన్ నాయక్, గోపి, అన్వర్, జ్యోతి, స్పందన తదితరులు పాల్గొన్నారు.

స్వేరోస్ ఆధ్వర్యంలో..

కోదాడ రూరల్: కోదాడలోని పట్టణ, రూరల్, ట్రాఫిక్ విభాగాల్లో ఏఎస్ఐలుగా విధులు నిర్వహిస్తూ ఎస్ఐలుగా పదోన్నతి పొందిన గుగులోత్ వెంకటేశ్వర్లు, ఎండీ. ఇస్మాయిల్, పి. వెంకటేశ్వర్లును శుక్రవారం స్వేరోస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో సన్మానించారు. స్వేరోస్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ చెరుకుపల్లి కిరణ్, పి.కల్యాణ్, ఎస్‌కే.బాజాన్, ప్రభాకర్, శిల్పి సుధాకర్, రఫీ పాల్గొన్నారు.

ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

నాగారం, జనవరి 17: మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మాతృమూర్తి సావిత్రమ్మ జ్ఞాపకార్థం ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాగారంలో శుక్రవారం క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుండగాని అంబయ్య, ఎల్క సైదులు, చిప్పలపల్లి చిరంజీవి, దోమల బాలమల్లు, కూరం వెంకన్న, కన్నెబోయిన భద్రయ్య, దేవరకొండ మురళి, చిప్పలపల్లి బాలస్వామి, మల్లేశ్, ఆకారపు శోభన్, చిప్పలపల్లి పండు, అజయ్, కడియం పవన్ పాల్గొన్నారు.

వ్యవసాయేతర భూముల గుర్తింపునకు సర్వే

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

మఠంపల్లి: భూముల సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

మఠంపల్లి, జనవరి 17: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయేతర భూముల గుర్తింపునకు సర్వే చేపడుతున్నట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. రైతు భరోసా లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి మండలంలోని పెదవీడు, చౌటపల్లి గ్రామాల్లో శుక్రవారం జరిగిన సర్వేను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ, వ్యవసాయేతర భూములను పరిశీలించారు. సర్వేలో ఎలాంటి తప్పిదాలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఆర్డీఓ శ్రీనివాసులు, తాసీల్దార్ మంగ, డిప్యూటీ ల్యాండ్ సర్వేయర్ వంశీ, ఏడీఏ రవికుమార్, ఏఈఓ రమ్య, మండల సర్వేయర్ సమీర్ పాల్గొన్నారు.

చదువుపై ఆసక్తి పెంచుకోవాలి..

చిన్ననాటి నుంచే విద్యార్థులు చదువుపై మక్కువ పెంచుకోవాలని కలెక్టర్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ మఠంపల్లి తాసీల్దార్ కార్యాలయానికి వెళ్తున్న క్రమంలో కోదాడలో 4వ తరగతి చదువుతున్న చెన్నాయిపాలెం గ్రామానికి చెందిన భూక్యా నిఖిత కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం కోసం తాసీల్దార్ కార్యాలయం దగ్గర నిలబడి ఉండడంతో కలెక్టర్ చిన్నారితో కాసేపు ముచ్చటించారు. బాగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని అన్నారు. అనంతరం కారులో నుంచి నోట్ బుక్స్‌ని తీసి చిన్నారికి అందజేశారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి..

సూర్యాపేట: జిల్లాలో జరుగుతున్న రోడ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రోడ్లు, భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో చేపడుతున్న రోడ్ల నిర్మాణాలపై ఆయన అధికారులతో సమీక్షించారు. నిర్మాణ సమయంలో మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకొని నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని తెలిపారు. అన్ని పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణం మార్చి రెండో వారంలో లోగా పూర్తి చేయాలన్నారు. సూర్యాపేటలో ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నిర్మాణానికి స్థల పరిశీలన చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ ఎస్ఈ ప్రకాశ్, ఈఈ వెంకటయ్య, ఆర్అండ్‌బీ ఈఈ సీతారామయ్య, డీఈ పవన్, మిషన్ భగీరథ ఇంజినీర్ అరుణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

గడువులోపు సీఎంఆర్ పూర్తి చేయాలి..

జిల్లాలో 2023-24 రబీ సీజన్‌కు సంబంధించి 8,295 మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌ను ఎఫ్‌సీఐకి, సివిల్ సప్లయి గోడౌన్లకు డెలివరీ చేయాల్సిన అవసరం ఉందని, వెంటనే రైస్ మిల్లుల యాజమాన్యాలు వారికి కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు జిల్లా సివిల్ సప్లయి అధికారులు, రైస్ మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అదనపు కలెక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

తిరుమలగిరి, జనవరి 17: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తిరుమలగిరి, నాగారం మండలాలకు చెందిన 71 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే మందుల సామేలు శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అనసూయ, పీఏసీఎస్ చైర్మన్ పాలేపు చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

కళాశాలలో వసతులు కల్పించాలి..

మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని కోరుతూ కళాశాల అధ్యాపక బృందం ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే సామేల్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రిన్సిపాల్ రాజమోహన్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష..

మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 9 మండలాల తాసీల్దార్లు, సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్‌రావుతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

గరిడేపల్లి, జనవరి 17: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మండల కేంద్రంలోని కోదాడ-మిర్యాలగూడ ప్రధాన రహదారిపై సాయి శ్రీనివాస హోటల్ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్మల్‌చెర్వు గ్రామానికి చెందిన కొప్పునూరి మురళీధర్ బైక్‌పై వస్తున్న క్రమంలో వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మురళీధర్‌కు కాలు విరగడంతో పాటు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అంబులెన్స్‌లో మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించారు.

గ్యాస్ సిలిండర్ల దొంగ అరెస్ట్

స్వాధీనం చేసుకున్న సిలిండర్లతో పట్టణ సీఐ రాము, సిబ్బంది

కోదాడ రూరల్, జనవరి 17: కోదాడ ప్రాంతంలో గ్యాస్ సిలిండర్ల దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తిని కోదాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ రాము వివరాలను వెల్లడించారు. కోదాడ, మేళ్లచెర్వు ప్రధాన రహదారిపై పట్టణ శివారులోని విశ్వబ్రాహ్మణ కాలనీ సమీపంలో పట్టణ పోలీసులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. బైక్‌పై గ్యాస్ సిలిండర్‌తో అటుగా వచ్చిన మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన మామిడి శ్రీకాంత్ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. అతడిని విచారించగా కోదాడ, అనంతగిరి మండల పరిధిలో పలు ఇండ్లలో 39 గ్యాస్ సిలిండర్లను దొంగతనం చేసి ఇతరులకు విక్రయించినట్లు ఒప్పుకున్నాడు. పోలీసులు 23 మంది నుంచి సిలిండర్లను స్వాధీనం చేసుకొని దొంగ సొత్తును కొన్నందుకు వారికి నోటీసులు ఇచ్చారు. కాగా, నిందితుడిపై హైదరాబాద్, మెదక్, నర్సాపూర్, గుమ్మడిదల, జీడిమెట్ల ప్రాంతాల్లో పలు కేసులు ఉన్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు వెల్లడించారు. పట్టణ ఎస్ఐ రంజిత్‌రెడ్డి, క్రైమ్ టీం హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కోదాడలో నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

కోదాడ రూరల్, జనవరి 17: కోదాడలో నేడు నిర్వహించనున్న నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు పరీక్షల నిర్వహణ చీఫ్ సూపరింటెండెంట్ గుడిబోయిన రాజు తెలిపారు. శుక్రవారం బాలుర ఉన్నత పాఠశాలలో ఇన్విజిలేటర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కోదాడ పట్టణంలో నిర్వహించే పరీక్షకు 388 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. బాలికల ఉన్నత పాఠశాల కేంద్రంలో 218 విద్యార్థులు, బాలుర ఉన్నత పాఠశాలలో 170 మంది పరీక్షలు రాయనున్నట్లు వెల్లడించారు. పరీక్ష ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరుగుతుందని, విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 10.00 గంటల వరకు చేరుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో హెచ్ఎం డి.మార్కండేయ పాల్గొన్నారు.

'పేదలకు అండగా లయన్స్ క్లబ్'

నేరేడుచర్ల, జనవరి 17: ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో లయన్స్ క్లబ్ అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ పేదలకు అండగా నిలుస్తోందని లయన్స్ క్లబ్ నల్లగొండ జిల్లా వైస్ గవర్నర్ కేవీ.ప్రసాద్ అన్నారు. శుక్రవారం నేరేడుచర్లలోని బెనర్జీ ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సేవా భావంతో తమ సమయాన్ని, ధనాన్ని వెచ్చించి పేదలకు లయన్స్ క్లబ్ సభ్యులు సేవలు అందిస్తున్నారని అన్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి, సూర్యాపేట కంటి ఆసుపత్రి వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, జోన్ చైర్మన్ చల్లా ప్రభాకర్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, సైదిరెడ్డి, యూసుఫ్, క్రాంతికుమార్, సీతారాంరెడ్డి, శ్రీరాంరెడ్డి, రమేశ్‌బాబు, సైదా నాయక్, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఐ ఫోరం కమిటీ నియామకం

తుంగతుర్తి, జనవరి 17: సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ఆక్టివిస్ట్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని బండరామారం గ్రామానికి చెందిన బైరోజు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా పాలకవీడు మండలం సింగారం గ్రామానికి చెందిన జానకిరాములను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల గణేశ్ శుక్రవారం నియామక పత్రాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. జిల్లాలో ఆర్టీఐపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడతానని, ఫోరం బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

కోదాడ రూరల్, జనవరి 17: ఉరేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణ పరిధిలోని శ్రీమన్నారాయణ కాలనీలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీమన్నారాయణ కాలనీకి చెందిన టి.విజయ (38) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంటి చుట్టుపక్కల వారు గమనించి భర్తకు సమాచారం అందించారు. కాగా, ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది, ఈ విషయమై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పట్టణ పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గరిడేపల్లి, జనవరి 17: మండల కేంద్రంలోని కల్మల్‌చెర్వు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గరిడేపల్లి టౌన్ ఫీడర్ కింద 11 కేవీ విద్యుత్ స్తంభాల మార్పు పనులు జరుగుతున్నందున శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ గన్న సాయికృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గరిడేపల్లిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

'అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలి'

నేరేడుచర్ల, జనవరి 17: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు కొణతం నాగిరెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో తాసీల్దార్ సైదులుకు వినతి పత్రం అందజేశారు. అర్హుల ఎంపికలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని తాసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు జూలూరు అశోక్, కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు తాళ్ల నరేందర్ రెడ్డి, నాయకులు నాగేశ్వరరావు, రమణ, శంకర్ రెడ్డి, నాగయ్య, సైదిరెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పరిసరాల పరిశుభ్రత పాటించాలి'

కోదాడ రూరల్, జనవరి 17: కోదాడ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోని నివాస గృహాలు, వ్యాపార సంస్థల వారు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండల విద్యాధికారి ఎండీ. సలీం, కౌన్సిలర్ లంకెల నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చేపట్టిన పాఠశాల మైదానం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఇండ్లు, వ్యాపార సంస్థలకు చెందిన చెత్తాచెదారం పాఠశాల మైదానంలో వేస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బడుగుల సైదులు, జానిమియా తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పెన్‌పహాడ్, జనవరి 17: మండలంలోని నాగులపాటి అన్నారం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను టీపీసీసీ కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ తూముల భుజంగరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ముత్తినేని శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

తుంగతుర్తి, జనవరి 17: మండల కేంద్రానికి చెందిన తాపీ మేస్త్రీ తడకమళ్ల సుధాకర్ కొన్ని నెలల క్రితం ప్రమాదవశాత్తు కిందపడి అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మరణించాడు. సుధాకర్‌కు ఇద్దరు కుమార్తెలు ఉండడంతో మొదటి కుమార్తె వేమని తండ్రికి తలకొరివి పెట్టి అంత్యక్రియలు పూర్తి చేసింది. ఈ విషాదకర ఘటన చూసి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు : అదనపు కలెక్టర్ రాంబాబు

చివ్వెంలలో అధికారుల నుంచి వివరాలు సేకరిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

చివ్వెంల, జనవరి 17: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అదనపు కలెక్టర్ రాంబాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి మాట్లాడారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆహార భద్రతా కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు అర్హులను గుర్తించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో రైతు భరోసా పథకానికి సంబంధించి పలు లేఅవుట్ భూములను పరిశీలించారు. వ్యవసాయేతర భూములను గుర్తించి యజమానులను రైతు భరోసాకు అనర్హులుగా గుర్తిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ సంతోశ్ కుమార్, మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మోతె: సంక్షేమ పథకాల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. రాఘవాపురం, నామవరం గ్రామాల్లో శుక్రవారం చేపట్టిన సర్వేను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

మెరుగైన ఫలితాల సాధనకు విద్యార్థులు కృషి చేయాలి

- డీఐఈఓ భానునాయక్

అధ్యాపకులతో మాట్లాడుతున్న డీఐఈఓ భానునాయక్

నడిగూడెం, జనవరి 17: ఇంటర్ విద్యార్థులు మెరుగైన ఫలితాల సాధన కోసం కృషి చేయాలని డీఐఈఓ భానునాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. రిజిస్టర్లను, ప్రయోగశాలలను పరిశీలించారు. ఇంటర్ బోర్డు నిర్ణయించిన ప్రణాళికను అధ్యాపకులు కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయనాయక్, అధ్యాపకులు జానిపాషా, శ్రీధర్, మహేశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'క్షయ రహిత సమాజానికి కృషి చేయాలి'

అర్వపల్లి: క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

అర్వపల్లి, జనవరి 17: క్షయ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు భూక్యా నగేశ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం 20 మందికి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నగేశ్ మాట్లాడుతూ.. ఎవరికైనా క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నట్లయితే, సకాలంలో గుర్తించి చికిత్స అందిస్తే పూర్తిగా నయమవుతుందని తెలిపారు. క్షయ లక్షణాలు ఉన్నట్లయితే స్థానిక ఆశ కార్యకర్తలను, ఆరోగ్యసిబ్బందిని సంప్రదించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అందించే మందులను వాడి వ్యాధిని అదుపులో ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ లలిత, టీబీ నోడల్ పర్సన్ వీరయ్య, ల్యాబ్ టెక్నీషియన్ చొక్కయ్య, హెల్త్ అసిస్టెంట్ జ్యోతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: మండలంలోని ధర్మాపురం గ్రామంలో క్షయ వ్యాధి నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి స్రవంతి, సిబ్బంది శ్రీశైలం, శ్రీనివాస్, శశిరేఖ, సైదులు, వెంకటరమణ, ప్రసాద్, మాధవరెడ్డి, రజని, సుమలత తదితరులు పాల్గొన్నారు.

సాగు భూమికే రైతు భరోసా : ఆర్డీఓ

అర్వపల్లి: తిమ్మాపురంలో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ వేణుమాధవరావు

అర్వపల్లి, జనవరి 17: సాగు భూమికే రైతు భరోసా వర్తిస్తుందని ఆర్డీఓ వేణుమాధవరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపురం గ్రామంలో చేపట్టిన రైతు భరోసా సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. తాసీల్దార్ శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ జలంధర్‌రావు, ఆర్ఐ వెంకట్‌రెడ్డి, ఏఈఓ సత్యం పాల్గొన్నారు.

తిరుమలగిరి: మండలంలోని అనంతారం, మామిడాల గ్రామాల్లో సర్వేను ఆర్డీఓ వేణుమాధవరావు పరిశీలించారు. తాసీల్దార్ హరిప్రసాద్, ఏఓ నాగేశ్వర్‌రావు, ఏఈఓ లక్ష్మి, సర్వేయర్ ఆలెన్ జోసెఫ్ పాల్గొన్నారు.

మునగాల: మండలంలోని కొక్కిరేణి, తాడువాయి, కలకోవ, వెంకట్రామాపురం, జగన్నాథపురం గ్రామాల్లో నిర్వహించిన సర్వేను ఆర్డీఓ సూర్యనారాయణ పరిశీలించారు. తాసీల్దార్ ఆంజనేయులు, ఏడీఏ యల్లయ్య, ఏఓ రాజు పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: మండలంలో చేపట్టిన రైతు భరోసా సర్వేను తాసీల్దార్ జ్యోతి పరిశీలించారు. ఆర్ఐ మోషిన్‌బాబా, ఏఈఓ వీరనాగరాజు పాల్గొన్నారు.

నేరేడుచర్ల: మండలంలోని చిల్లేపల్లిలో తాసీల్దార్ సైదులు, ఎంపీడీఓ సోమసుందర్ రెడ్డి సర్వేను పరిశీలించారు.

'ధ్వంసమైన రోడ్ల స్థానంలో కొత్తవి నిర్మించాలి'

హుజూర్‌నగర్, జనవరి 17: హుజూర్‌నగర్ పట్టణంలో ధ్వంసమైన రోడ్ల స్థానంలో కొత్త రోడ్లను నిర్మించాలని కోరుతూ సీపీఎం పట్టణ కార్యదర్శి పల్లె వెంకటరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. పట్టణంలో రహదారులు దెబ్బతిని వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నెలలో జరగనున్న పాలకవర్గ చివరి సర్వసభ్య సమావేశంలో ప్రత్యేక ఎజెండాగా తీసుకొని రోడ్ల నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ త్రివేణి, నాయకులు బ్రహ్మం, మురళి, వీరయ్య, వెంకటనారాయణ, వెంకన్న, వేణు తదితరులు పాల్గొన్నారు.

'అర్హులకు రేషన్‌కార్డులను మంజూరు చేయాలి'

గరిడేపల్లి, జనవరి 17: ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం అర్హులందరికీ రేషన్‌కార్డులను మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు త్రిపురం సుధాకర్‌రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు కడియాల అప్పయ్య, యడ్ల అంజిరెడ్డి, కుందూరు వెంకటరెడ్డి, గోదుమల ఈశ్వరాచారి, దైదా చంద్రాక్, గోవింద్, బాలకృష్ణ పాల్గొన్నారు.

'రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందజేయాలి'

సమావేశంలో మాట్లాడుతున్న రాములు

నేరేడుచర్ల, జనవరి 17: రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు బెనిఫిట్స్ వీలైనంత త్వరగా అందజేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.రాములు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో నేరేడుచర్ల, పాలకవీడు, గరిడేపల్లి మండలాల యూటీఎఫ్ ప్రాంతీయ సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఖాళీగా ఉన్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లోని నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీ అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ అనిల్‌కుమార్, కార్యదర్శులు వీరారెడ్డి, బాలసైదిరెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ సాంబయ్య, శ్రీనయ్య, సైదులు నాయక్, వెంకటేశ్వరరావు, రాఘవరెడ్డి, రామానుజం, అక్కయ్య బాబు తదితరులు పాల్గొన్నారు.